

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కలెక్టరేట్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ జరగనున్నాయని ఆర్ఐవో మజ్జి ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. మే ఒకటో తేదీ నుంచి 4 వరకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో వెనుకంజ

- విద్యాశాఖ మంత్రి జిల్లాలో దారుణమైన రిజల్ట్
- పాస్ కాని 10వేల మందికిపైగా విద్యార్థులు
- గాడి తప్పిన ఇంటర్ విద్య
- ప్రచారానికే పరిమితమైన ప్రభుత్వం





దేవుదళ కేజీబీవీలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి మిఠాయి తినిపిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత జిల్లాలోనే ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు దారుణంగా వచ్చాయి. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల్లో మొత్తం 10,906 మంది పాస్ కాలేదు. వీరిలో అధిక శాతం మంది ప్రభుత్వ విద్యార్థులే. గతేడాది ఫలితాలతో పోలిస్తే రాష్ట్రంలో విజయనగరం జిల్లా ఫస్టియర్‌లో 13వ స్థానంలో, సెకండియర్‌లో 19 స్థానంలో నిలిచింది. ●మొదటి సంవత్సరం జనరల్ గ్రూపులో మొత్తం 16,584 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 10,267 మంది ఉత్తీర్ణత (62శాతం) సాధించారు. 6,317 మంది తప్పారు. బాలురు 7,681 మందికి 4,234 (55 శాతం) మంది, బాలికలు 8,903 మందికి 6,033 మంది ఉత్తీర్ణత (68శాతం) సాధించారు. ఒకేషనల్ గ్రూపులో 2,909 మందికి గాను 1,679 మంది పాసయ్యారు. 1,230 మంది ఫెయిలయ్యారు. ● రెండో సంవత్సరం జనరల్ గ్రూపులో 15,180 మంది పరీక్షలు రాయగా 10,591 మంది ఉత్తీర్ణత (70 శాతం) సాధించారు. 4,589 మంది ఫెయిలయ్యారు. బాలురు 6,793 మందికి గాను 4,377 మంది (64శాతం), బాలికలు 8,387 మందికి గాను 6,214 మంది ఉత్తీర్ణత (74 శాతం) పొందారు. ఒకేషనల్‌లో 2,693 మందికి 1,824 మంది ఉత్తీర్ణత (68 శాతం) సాధించారు. 869 మంది ఫెయిలయ్యారు. మొత్తంగా ఫస్టియర్, సెకండియర్‌లో 31,764 మందికి 20,858 మంది పాసయ్యారు. ఇదీ విద్యాశాఖ మంత్రి సొంత జిల్లాలో పరిస్థితి. అయితే గత ఆరేళ్లతో పోల్చితే ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగ్గా ఉంది.

కారణాలు ఎన్నో..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్య గాడితప్పింది. దీంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ప్రతి ఏడాదీ జిల్లాలో పదో తరగతి ఫలితాలకు ఇంటర్ ఫలితాలకు భారీ వ్యత్యాసం ఉంటోంది. టెన్త్‌లో 90 శాతం పైబడి విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తుంటే ఇంటర్‌కు వచ్చేటప్పటికీ ఫలితాలు దారుణంగా పడిపోతున్నాయి. 80 శాతం లోపే ఫలితాలు వస్తున్నాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువశాతం మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే చదువుతుంటారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సైతం అందించడం లేదు. దీంతో కొత్త పుస్తకాలను బయట మార్కెట్లో కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేక కొందరు విద్యార్థులు పాత పుస్తకాలతోనే కుస్తీలు పడుతున్నారు. మరికొందరు విద్యార్థులకు పాత పుస్తకాలు దొరక్క కళాశాలల్లో చెప్పిన నోట్స్‌పైనే ఆధారపడుతున్నారు. చాలా జూనియర్ కళాశాలల్లో పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరు. గత ప్రభుత్వం తెలుగు అకాడమీ ద్వారా ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠ్యపుస్తకాల సరఫరాను నిలిపివేసింది. దీంతో పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. చదువులో వెనుకబడుతున్నారు. ఇలా అనేక సమస్యలు ఇంటర్ ఫలితాలు తగ్గడానికి కారణమవుతున్నాయి. ప్రభుత్వం మాత్రం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుంది.

దేవుదళ, బాడంగి కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత

రేగిడి, బాడంగి, ఏప్రిల్ 12: రేగిడి మండలం దేవుదళ, బాడంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. దేవుదళ కేజీబీవీలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 20 మంది విద్యార్థులు (ఒకేషనల్) పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో ఎ.మహాలక్ష్మి 467 (500), సెకండియర్‌లో ఎ.సరస్వతి 884 (1000) మార్కులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి, అధ్యాపకులు అభినందించా రు. ●బాడంగి కేజీబీవీలో ప్రథమ సంవత్సరంలో 23మందికిగానూ 23మంది, ద్వితీయ సంవత్సరంలో 31 మందికి 31మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ జి.హరిత తెలిపారు. ఫస్టియర్ బైపీసీలో చిన్నారి 419 మార్కులు, సెకండియర్ ఎంపీసీలో బి.గీత 923 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే బాడంగి గురుకుల పాఠశాలలో ప్రథమ సంవత్సరంలో 17 మందికి 17 మంది, ద్వితీయ సంవత్సరంలో 24 మందికి 24మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ రామదాసు తెలిపారు. ఫస్టియర్‌లో దువ్వార చందుకు 433 మార్కులు, సెకండియర్‌లో డేవిడ్‌కు 907 మార్కులు వచ్చినట్లు తెలిపారు.



బి.గీత (923)

రాసిందే ఒక్కరే..

కలెక్టరేట్: దత్తిరాజేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరంలో ఒక విద్యార్థి మాత్రమే పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాడు. దీంతో ఆ కళాశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

జిల్లాకు చంద్రబాబు, పవన్ రాక

- 15న టీడీపీ అధినేత.. ● 16న ఉమ్మడిగా రోడ్‌షో



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జిల్లాకు రానున్నారు. కూటమి అభ్యర్థుల తరపున వీరు ప్రచారం చేయనున్నారు. ఈ నెల 15న ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా రాజాంలో చంద్రబాబు పర్యటించనున్నారు. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మరుసటి రోజు 16న చీపురుపల్లి మీదుగా నెల్లిమర్లకు చేరుకుంటారు. అదే రోజున పవన్‌కల్యాణ్ వారాహి యాత్రలో భాగంగా నెల్లిమర్ల రానున్నారు. చంద్రబాబు, పవన్ ఉమ్మడిగా నెల్లిమర్లలో రోడ్‌షో నిర్వహించనున్నారు. రామతీర్థం కూడలిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. తరువాత విజయనగరం చేరుకుని అంబేడ్కర్(బాలాజీ) కూడలిలో ప్రసంగిస్తారు. ఇందుకు సంబంధించి ఇరుపార్టీల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో(అశోక్ బంగ్లా) నియోజకవర్గ నేతలతో కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు సన్నాహక సమావేశం నిర్వహించారు. జన సమీకరణపై చర్చించారు. అలాగే, అంబేడ్కర్ కూడలిలో రోడ్‌షో ప్రసంగ స్థలాన్ని అదితి గజపతిరాజు, తదితరులు పరిశీలించారు. తమ అధినేతల పర్యటనలు విజయవంతం చేసేందుకు ఇరు పార్టీల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



శ్రేణులతో సమావేశమైన మాజీ మంత్రి అశోక్

వీల్ చైర్లు ఏవీ?

- సర్వజనాసుపత్రిలో కొరత ● 500 పడకలకు 20 వీల్ చైర్లే..
- దివ్యాంగులు, వృద్ధులకు తప్పని ఇబ్బందులు



ప్రభుత్వ సర్వజనాసుపత్రి

(విజయనగరం రింగురోడ్డు)

ప్రభుత్వ సర్వజనాసుపత్రి బోధనాసుపత్రి స్థాయికి ఎదిగినా ఇంకా బాలారిష్టాలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా రోగులను తరలించే వీల్ చైర్లు పూర్తిస్థాయిలో లేవు. 500 పడకల ఆసుపత్రికి సంబంధించి కనీసం సగం వీల్ చైర్లు ఉండాలి. కానీ 20 వీల్ చైర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వజనాసుపత్రిలో ప్రతి రోజూ 500 నుంచి వెయ్యి వరకూ ఓపీ ఉంటుంది. నడవలేని రోగులు వైద్యులు, ల్యాబ్‌ల వద్దకు వెళ్లాలన్నా, వారు ఉన్న గదికి వెళ్లాలన్నా వీల్ చైర్లు అవసరం. అయితే అవి పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు వీటికోసం రోగుల మధ్య తగదాలు కూడా జరుగుతున్నాయి. వీల్‌చైర్లు దొరక్కపోవడంతో రోగులను వారి బంధువులే మోసుకుని డాక్టర్లు, ల్యాబ్‌ల వద్దకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఫిర్యాదు చేద్దామన్నా హెల్ప్‌డెస్క్ కూడా లేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎమర్జెన్సీ వార్డు వద్ద వీల్‌చైర్ కోసం ఆటోలో నిరీక్షిస్తున్న రోగి

ఇబ్బంది పడ్డాను..

నేను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాను. దీనివల్ల నడవలేకపోతున్నాను. డాక్టరు వద్దకు వెళ్లేందుకు వీల్ చైర్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాను. దానికోసం ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు వీల్‌చైర్ దొరకడంతో అందులో నన్ను కూర్చోబెట్టి వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. తక్షణమే ఆస్పత్రిలో అవసరమైన వీల్ చైర్లు ఏర్పాటు చేయాలి.

-పి.సన్యాసినాయుడు, పూసపాటిరేగ

అందుబాటులోకి తెస్తాం..

ఆస్పత్రిలో వీల్ చైర్లు తక్కువగా ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించాం. తక్కువ వీల్ చైర్లు ఉండడంతో ఎవరికి వారు, ఆయా విభాగాలకు వెళ్లేందుకు వాటిని ఉపయోగించుకుంటున్నారు. దీంతో మిగిలిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత ఎక్కువ వీల్ చైర్లు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తాం.

-అనిలా సునందని, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజనాసుపత్రి



వీల్ చైర్ల కోసం నిరీక్షిస్తున్న రోగులు

రూ.1500 చెల్లించలేరా?

- 15 నెలలుగా పారితోషికం బకాయి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న హాస్టళ్ల ట్యూటర్లు

బొబ్బిలి, ఏప్రిల్ 12: పథకాల కింద వేలాది రూపాయలు జమ చేస్తున్న ప్రభుత్వానికి తమ పారితోషికం బరువైందా అంటూ హాస్టల్ ట్యూటర్లు ప్రశ్నిస్తున్నారు. కేవలం రూ.1500 చొప్పున 15 నెలల పారితోషికం ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవా? అని వాపోతున్నారు. బీసీ వసతి గృహాల్లో ఉంటున్న పదోతరగతి విద్యార్థులకు లెక్కలు, ఇంగ్లీషు, సైన్స్, హిందీ సబ్జెక్టులను బోధించేందుకు ట్యూటర్లను నియమించుకున్నారు. నెలకు రూ.1500 చొప్పున ఒక్కొక్కరికీ పారితోషికం నిర్ణయించారు. గత ఏడాది జూలై నుంచి వారిలో ఏ ఒక్కరికీ చిల్లిగవ్వయినా ఇవ్వకపోడం గమనార్హం. బొబ్బిలి బీసీ సహాయ సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో బొబ్బిలి బాలికల బీసీ హాస్టల్, కలవరాయి, పిరిడి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, జీఎస్‌పురం, సంతకవిటి, రాజాం తదితర హాస్టళ్లలో నాలుగు సబ్జెక్టులకు నలుగురు చొప్పున ట్యూటర్లను నియమించారు. వీరిలో చాలా మంది బీఈడీ చదువుకొని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసిన వారు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. ఎంతో కొంత ఆసరాగా ఉంటుందన్న ఉద్దేశంతో తక్కువ పారితోషికం అయినప్పటికీ ట్యూటర్లుగా పనిచేస్తున్నారు. ఈ కొద్దిమొత్తం వంటగ్యాస్ సిలిండర్ కొనుగోలుకో, మందుల ఖర్చు లేదా ఇతర చిన్నపాటి అవసరాలకో పనికొస్తుందని భావించి పని చేస్తున్నారు. ఆ డబ్బులు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం మొండి చెయ్యి చూపడం పట్ల వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారితోషికం కోసం హాస్టల్ వార్డెన్లపై ఒత్తిడి తెస్తున్నా ప్రయోజనం లేకపోతోంది. వీరి బాధ చూసి కొంతమంది వార్డెన్లు నలుగురికి బదులుగా ఇద్దరిని మాత్రమే ట్యూటర్లుగా నియమించుకొని మమ అనిపిస్తున్నారు. హాస్టళ్లలో ఉన్న పదో తరగతి విద్యార్థులంతా పరీక్షలు రాసి ఇంటి ముఖం పట్టారు. అయినా ట్యూటర్లకు గత ఏడాది జూలై నుంచి పారితోసికం దక్కలేదు.



విద్యార్థులకు బోధిస్తున్న ట్యూటర్ (ఫైల్)

15 ఏళ్లుగా పనిచేస్తున్నాను..



నేను 15 ఏళ్ల నుంచి హిందీ ట్యూటర్‌గా పనిచేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం రాకపో వడంతో ప్రైవేట్ కాన్వెంట్‌లో పనిచేస్తూ ట్యూటర్‌గా సేవలందిస్తున్నాను. గత ఏడాది జూన్ నుంచి మాకు నెలవారీగా రావాల్సిన రూ.1500 చెల్లించడం లేదు. అధికారులను, వార్డెన్లను అడుగుతుంటే బడ్జెట్ రాలేదని చెబుతున్నారు. ప్రభుత్వానికి అత్యంత స్వల్ప మొత్తం చెల్లించడం పెద్ద సమస్య కాదు. అయినా పట్టించుకోవడం లేదు.

-ఏవీ కళ్యాణి, హిందీ ట్యూటర్, పిరిడి బీసీ హాస్టల్

నిధులు రాకే..

ట్యూటర్లకు గత ఏడాది జూలై నుంచి పారితోషికం చెల్లించకపోవడం వాస్తవమే. ఇందుకు సంబంధించిన బడ్జెట్ రాకపోవడంతో ఇవ్వలేకపోతున్నాం. ఈ సమస్య కారణంగా నలుగురేసి ట్యూటర్లను నియమించుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ ఇద్దరితో సరిపెడుతున్నాం.

-దాసు, వార్డెన్

డ్వాక్రా సొమ్ము పక్కదారి

- రూ.16 లక్షల మేర అక్రమాలు
- స్త్రీ నిధి రుణాలదీ అదేబాట
- వెలుగు సిబ్బందిపై అనుమానాలు
- కలెక్టర్‌కు మెంటాడ సర్పంచ్ ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి

మెంటాడ, ఏప్రిల్ 12: మండల కేంద్రం మెంటాడలో డ్వాక్రా సొమ్ము పక్కదారి పట్టింది. రూ.16 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు గతం వారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గాయి. వెలుగు సిబ్బందిపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులు కూడా విచారణ ప్రారంభించారు. ఈ విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మెంటాడ గ్రామ పంచాయతీ పరిధిలోని 700 డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రతినెలా క్రమం తప్పకుండా అప్పు, పొదుపు కింద డబ్బును బ్యాంకు ఖాతాల్లో జమచేసేందుకు సంబంధిత వెలుగు సిబ్బందికి అందించేవారు. ఇలా మొత్తం రూ.61,86,970 ఇచ్చారు. అయితే, కొన్ని గ్రూపులకు చెందిన నగదు బ్యాంకు ఖాతాలకు జమకాలేదని తెలిసి సంబంధిత గ్రూపుల అధ్యక్ష, కార్యదర్శులు సర్పంచ్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన విచారణ చేపట్టగా రూ.16,85,825 పక్కదారి పట్టినట్టు గుర్తించి ఆధారాలతో సహా గత వారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆయా సంఘాలు బ్యాంకుల నుంచి రుణం ఎప్పుడు పొందాయి.. ఇప్పటివరకు ఎంత చెల్లించాయి తదితర వివరాలపై ఆరా తీసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వెలుగు సిబ్బందిని కాపాడే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే వారిని రహస్యంగా విచారించి చేతివాటం చూపిన సిబ్బంది నుంచి సొమ్మును రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఫిర్యాదు కాపీ

స్త్రీ నిధి రుణాలు కూడా..

కొన్ని గ్రూపులకు చెందిన సభ్యులు స్త్రీ నిధి రుణాలు పొంది వాటిని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తున్నా రు. అయితే, కొందరు స్త్రీనిధి రుణాల తీసుకోకపోయినా తీసుకున్నట్లు బ్యాంకు సిబ్బంది చెబుతుండడంతో వారు అవాక్కవుతున్నారు. దీనిపై ఆరాతీస్తే ఇందులో వెలుగు సిబ్బంది చేతివాటం వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. వాస్తవానికి స్త్రీనిధి రుణాలు లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమవుతాయి. అయితే, సభ్యులను వెలుగు సిబ్బంది మభ్యపెట్టి తీర్మానం రాయించి సంతకాలు చేయించుకున్న తర్వాత బ్యాంకు సిబ్బంది సహకారంతో ఆ రుణం మొత్తాన్ని చెక్కురూపంలో పొంది ఉంటారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై స్త్రీ నిధి విభాగం జిల్లా మేనేజర్ రమేష్ వివరణ కోరగా.. 'ఫిర్యాదు అందింది. మార్చి వరకూ బకాయిలు లబ్ధిదారులు క్లియర్ చేసేశారు. ఏప్రిల్ నుంచి వాయిదాలు చెల్లించాల్సిన రుణాలు ఉన్నాయని' తెలిపారు. ఫిర్యాదు తర్వాత క్లియర్ చేయడమంటే అవకతవకలు నిజమే కదా, బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించగా సూటిగా సమాధానం చెప్పలేదు.

చర్యలు తీసుకోవాల్సిందే..

సుమారు రూ.16 లక్షల డ్వాక్రా సొమ్ము పక్కదారి పట్టింది. దీన్ని అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నట్టుగా ఉంది. విచారణలో గోప్యతకు కారణమేంటో చెప్పాలి. బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారో వెల్లడించాలి. రికవరీ జరిగిందని చెబుతున్న అధికారుల మాటల్లో పొంతనలేదు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందే.

-రాంబాబు, సర్పంచ్, మెంటాడ

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

కొమరాడ: మాదలంగి గ్రామంలో గురువారం రాత్రి గడ్డి మందు తాగిన అధికారి వెంకటేష్(32) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి మద్యం తాగి రావడంతో భార్య రమాదేవి నిలదీసింది. దీంతో మనస్థాపానికి గురైన వెంకటేష్ గడ్డి మందు తాగాడు. దీంతో వెంటనే కురుపాం వైద్యశాలకు తీసుకువెళ్లి చికిత్స అందించారు. మరింత మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏవోబీ సరిహద్దు తాటిశీల గ్రామంలో ఒడిశా నుంచి కారు, ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇరువురు వద్ద నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న సుమారు 141 మద్యం సీసాలను ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కారు, బైకును, మద్య సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

● **కొమరాడ:** మండలంలో రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన బొట్ట రామకృష్ణ అనే వ్యక్తి నుంచి 46 మద్యం సీసాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బాడంగి: అక్రమంగా మద్యం, నగదు తరలించడాన్ని నిరోధించడానికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. మండల కేంద్రంలో ఆమె శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

అంబేడ్కర్ గురుకులాల్లో 87.4 శాతం ఉత్తీర్ణత

సాలూరు రూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉమ్మడి విజయనగరం జిల్లా బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 87.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 612 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు విద్యార్థులు హాజరు కాగా 535 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కొమరాడ, బాడంగి, వేపాడ, గరుగుబిల్లి గురుకులాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాయని చెప్పారు.

గంజాయి స్వాధీనం

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో రెండు కిలోల వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. కేరళకు చెందిన శిభిన్ జోసెఫ్, మితలేజ్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఒడిశా నుంచి దిగుమతి చేస్తుండగా కాలేజీ బ్యాగులో ఉన్న గంజాయి ప్యాకెట్లను పట్టుకున్నారు. దీని విలువ రూ.21 వేలు ఉంటుందని తెలిపారు.

టేకు చెట్ల నరికివేతపై ఫిర్యాదు



మాట్లాడుతున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

మెంటాడ: కుంటినవలస గ్రామంలో వై.సింహాచలం అనే వైసీపీ నాయకుడు తన టేకు చెట్లను అక్రమంగా నరికివేసినట్టు అదే గ్రామానికి చెందిన శ్రీదేవి అనే మహిళ శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ఏడు చెట్లను దౌర్జన్యంగా తమ భూమిలో నరికివేసి తరలించేందుకు సిద్ధపడ్డారని, విషయం తెలిసి ప్రశ్నించగా బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆమె వాపోయారు. న్యాయం జరిగేలా చూడాలని రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో పాటు స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. విలేకర్ల ముందు తమ గోడును వెళ్లగక్కారు. స్థానిక పెద్దలు, సర్పంచ్‌ను కలిసి జరిగిన విషయం చెప్పామని, అయినా న్యాయం జరగలేదన్నారు. అందుకే అధికారులను ఆశ్రయించినట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి మండలంలోని వివిధ గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆవాల అనంతరావు తెలిపారు. పారాది సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ మెట్టవలస ఫీడరు మధ్యలో విద్యుత్ స్తంభాలు వేయడానికి, లైన్లను పటిష్ఠం చేసేందుకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల పనుకువలస, కొత్తపెంట, మెట్టవలస, గున్నతోటవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. పిరిడి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఎ.వెలగవలస, అలజంగి, కారాడ, శివడవలస, పక్కి గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నందున వినియోగదారులు సహకరించాలని అనంతరావు కోరారు.

రేపు గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

రాజాం: బొబ్బిలి రోడ్డులోని గోపాలపురం సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డు, గొలవీధి. మాదిగ వీధి, మెంతిపేట ఎస్సీ కాలనీ, అమ్మవారి కాలనీ, చాకలి వీధి, ఆదర్శనగర్, బాలాజీనగర్, వస్త్రపురికాలనీ, కంచరాం, రాజయ్యపేట, గోపాలపురం, కొత్తవలస, మెంతిపేట, కొండంపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పరిశ్రమలకు కూడా సరఫరా నిలిపివేయనున్నట్టు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ

రేగిడి: ఉంగరాడమెట్ట, జాడపేట గ్రామాల మధ్యనున్న సూరమ్మకొండ గుట్టపై వెలిసిన భవతారిణి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు రెండోరోజు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో నిర్వాహకులు నడిపేన సన్నిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

విజయగనరం రూరల్: నగరంలోని మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో కణపాక ఆగురువీధిలో శుక్రవారం 50 మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర్, సభ్యులు అరసాడ అప్పలస్వామి, తులసీరామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

● ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి
● రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మిశ్రాకు వివరాల వెల్లడి



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న మిశ్రా

కలెక్టరేట్: ఎన్నికల సాధారణ పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా శుక్రవారం విజయనగరం జిల్లాలో పర్యటించారు. ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, ప్రవర్తనా నియమావళి అమలుకు తీసుకున్న చర్యలు, సీజర్ మేనేజ్‌మెంట్, ఎన్నికల శిక్షణ తదితర అంశాలను తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.1.54 కోట్ల విలువైన, నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎన్నికల కంట్రోల్ రూంను, మీడియా సెంటర్‌ను పరిశీలకులు మిశ్రా సందర్శించారు. ఈ పర్యటనలో ఎస్పీ దీపికా పాటిల్, జేసీ కార్తీక్ పాల్గొన్నారు.

ఈవీఎంల కేటాయింపు..

వచ్చే ఎన్నికల్లో వినియోగించేందుకు ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను కేటాయించారు. స్థానిక ఎన్ఐసీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఈ ప్రక్రియను నిర్వహించారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా వివిధ నియోజకవర్గాలకు ఈవీఎంలను కేటాయించారు.

సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించిన కలెక్టర్

కలెక్టరేట్ పోర్టికోవద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎంతో విలువైన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. ఓటు నమోదుకు ఇంకా మూడు రోజులు గడువు ఉందని తెలిపారు.

రూ.7.22 లక్షల నగదు సీజ్

బొబ్బిలి: బొబ్బిలి సర్కిల్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.7,22,530 నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. పాతబొబ్బిలి చెక్‌పోస్టు వద్ద తగరపువలసకు చెందిన తీల రమేష్ నుంచి రూ.3,42,500, జగ్గునాయుడుపేటకు చెందిన పూడి రామకృష్ణ నుంచి రూ.72 వేలు, బొబ్బిలి కంచరవీధికి చెందిన బంగార్రాజు నుంచి రూ.1.45 లక్షలు, రాజాం నుంచి తెర్లాంకు బొలేరా వాహనంలో వస్తున్న వ్యాపారి నుంచి రూ.73,500 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే, రామభద్రపురంలో సాలూరు నుంచి విజయనగరం వైపు వెళుతున్న వ్యక్తి నుంచి రూ.89,530 పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ లోవరాజు, సిబ్బంది ఉన్నారు.

రాజాంలో రూ.5 లక్షలు..

రాజాం రూరల్: రాజాం-శ్రీకాకుళం రోడ్‌లో పొగిరి జంక్షన్ వద్ద శుక్రవారం పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో నగదు పట్టుబడింది. శ్రీకాకుళం నుంచి రాజాం వైపు వస్తున్న కారును రాజాం టౌన్ సీఐ మోహనరావు, ఎస్ఐ రవికిరణ్ తనిఖీ చేయగా ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న రూ.5,23,300ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నగదును తరలిస్తున్న వ్యక్తిని రాజాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు: వినియోగదారుల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. దాసన్నపేట విద్యుత్ భవనంలో శుక్రవారం విద్యుత్ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. వీటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం, హెచ్చుతగ్గులు, మీటర్ సమస్య ఎక్కువ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్‌తో దగ్ధమవడం, బిల్లు పేర్లలో మార్పు తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 2023లో 536 ఫిర్యాదుల్లో 509 పరిష్కరించామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ వరకూ 140 ఫిర్యాదులు అందగా, 24 పరిష్కరించినట్టు తెలిపారు. 2016 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకూ రూ.26 వేల అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. విద్యుత్ సమస్యలను అధికారులు పరిష్కరించనప్పుడు తగిన ఆధారాలతో తమ ఫోరం దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకురావాలన్నారు. ఫోరంలో కేసులు వేయడానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన పని లేదన్నారు. ఫిర్యాదులను 1912 (టోల్ ఫ్రీ)కి చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.జనార్దనరావు, సూపరింటెంటెంట్ ఇంజనీరు మువ్వల లక్ష్మణరావు, విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినియోగదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

ముగిసిన కానిస్టేబుల్ అంత్యక్రియలు

వంగర: విశాఖ పట్నంలోని ఓ బ్యాంక్‌లో ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ పాలవలస శంకరరావు గురువారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. గురువారం రాత్రి 8 గంటలకు అతని మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.



అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎంఈఓ దుర్గారావు

పైడిమాంబ దేవస్థానం అన్నదానానికి నూతన భవనం

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లమ్మ దేవస్థానంలో అన్నదానానికి నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకూ శివాలయం వీధిలో ఉన్న పైడిమాంబ కల్యాణ మండపంలో అన్నదానం చేస్తున్నారు. పైడిమాంబ ఆలయ విస్తరణలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని మూడు లాంతర్ల వద్ద చదురు గుడి వెనుక భాగాన ఉన్న భవనంలోకి మార్చారు.. శుక్రవారం ఈఓ డీవీ ప్రసాద్, సూపరిడెంటెంట్ ఏడు కొండలు, అర్చకుడు బంటుపల్లి వెంకటరావు, పురోహితులు పూజలు నిర్వహించిన అనంతరం నూతన భవనంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ డీవీ ప్రసాదరావు మాట్లాడుతూ పైడిమాంబ అన్నదాన ట్రస్టుకు భక్తులు విరాళాలు ఇచ్చి.. రశీదు పొందాలన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు

కూలీ గిట్టుబాటు కావడం లేదు

లక్కవరపుకోట (కొత్తవలస): ఉపాధి హామీ పథకం పనిలోకి వెళ్లిన వారికి కూలీ గిట్టుబాటు కావడం లేదని... ఇకపై పనికి వెళ్లలేమని గాంధీనగర్ గ్రామానికి చెందిన కూలీలు నిరసన వ్యక్తం చేస్తూ ఇంటిముఖం పట్టారు. దీంతో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు గాడి అప్పారావు కూలీలతో మాట్లా డి... సమస్య పరిష్కారానికి ఎంపీడీవో కార్యాలయ అధికారులతో మాట్లాడుదామని చెప్పడంతో కూలీలు శాంతించారు. కొత్త ఏడాది నుంచి రోజుకు రూ.300 అని చెప్పి కేంద్ర ప్రభుత్వం కూలీలను మోసం చేసిందన్నారు. ఒక్కో మనిషికి రూ.51, రూ.61, రూ.91 వంతున ఖాతాల్లో పడ్డాయని మండిపడ్డారు.



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కోడిపందేలపై పోలీసుల దాడి

శృంగవరపుకోట: చామాలపల్లి పంచాయతీ కొత్తకోట గ్రామశివారుల్లో జరుగుతున్న కోడిపందేలపై సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. శుక్రవారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ గంగరాజు సిబ్బందితో వెళ్లి ముగ్గురు పందెపురాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడిపుంజులు, రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడి మృతి

మద్దిలపాలెం: వీఐపీ రోడ్డులో శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేపాడ మండలం కృష్ణరాజపురానికి చెందిన రాజ్‌కుమార్ (30) పాస్టర్‌గా శిక్షణ తీసుకున్నాడు. అతనికి చెవికి సంబంధించిన సమస్య ఉండడంతో ఉదయం బైక్‌పై నగరానికి వచ్చాడు. వీఐపీ రోడ్డు మీదుగా వెళుతుండగా లక్ష్మీగణపతి ఆలయం వద్ద వెనుక నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్, సీఐ అమ్మినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొద్దాంలో ఉద్రిక్తత

● వైసీపీ ప్రచారంలో వలంటీర్లు ● ప్రశ్నించిన టీడీపీ శ్రేణులు

రాజాం రూరల్: మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో శుక్రవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో అధికార వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనడమే దీనికి కారణం. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనడాన్ని ప్రశ్నించారు. తాము రాజీనామా చేశామని... ప్రశ్నించేందుకు మీకున్న అధికారం ఏమిటని వలంటీర్లు టీడీపీ శ్రేణులను ప్రశ్నించారు. దీంతో రాజాం ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావును వలంటీర్ల రాజీనామా వ్యవహారంపై టీడీపీ శ్రేణులు ప్రశ్నించాయి. గ్రామంలో 24 మంది వలంటీర్లు ఉండగా... కేవలం ఇద్దరు మాత్రమే రాజీనామా చేశారని ఎంపీడీఓ స్పష్టం చేశారు. దీంతో ప్రచారం నుంచి వైదొలగాలని వలంటీర్లను టీడీపీ నేతలు గట్టిగా నిలదీశారు. ఈ క్రమంలో ఇరుపార్టీల నాయకుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. విషయం తెలుసుకున్న రాజాం టౌన్ సి.ఐ.మోహనరావు ఆధ్వర్యంలో పోలీసులు రాత్రి పది గంటల సమయంలో రంగప్రవేశం చేశారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో గ్రామ వలంటీర్లు నక్క. గణేష్, మూకళ్ల లక్ష్మి, నక్క ధనలక్ష్మి, బట్న వెంకట లక్ష్మి, నక్క పార్వతి, మూకళ్ల శిరీష, బెండు లక్ష్మణరావు, బట్న భాగ్యలక్ష్మి, బట్న లక్ష్మి, అలజంగి లాస్య పాల్గొన్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. వీరందరినీ విధుల నుంచి తప్పించాలని టీడీపీ నాయకులు హరి, విష్ణు, సూర్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.... గ్రామంలో పరిస్థితి అదుపులో ఉందని సి.ఐ.మోహనరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



గ్రామంలో పోలీసు పహారా

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై ఫిర్యాదు

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వార్డు వలంటీర్లపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. గొల్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఒక వైసీపీ బృందం, శంబంగి సోదరుడు వేణుగోపాలనాయుడు, మాజీ కౌన్సిలరు తెర్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మరో బృందం, శంబంగి కుమారుడు శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరుల ఆధ్వర్యంలో మరో బృందం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆరుగురు వలంటీర్లు పాల్గొన్నట్లు గ్రామస్తులు ఎన్నికల అధికారులకు ఫొటోలతో సహా ఫిర్యాదులు పంపించారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

గొల్లపల్లిలో వలంటీర్లు ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. ఇది రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం. మాకు వచ్చిన ఫిర్యాదుపై సచివాలయం అడ్మిన్‌ను విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరాం. ముందుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వలంటీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. రుజువైతే వారిని తొలగిస్తాం.

-లాలం రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్

ఉపకరణాలకు దివ్యాంగుల ఎంపిక

రాజాం: స్థానిక భవిత కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరయ్యారు. 41 మందిని వీల్ చైర్స్‌కు, 37 మందిని రోలేటర్స్‌కు, 22 మందిని ట్రైసైకిళ్లకు, 11 మందిని ఎంఆర్ కిట్స్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎస్.సూర్యారావు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఎంఈఓ వై.దుర్గారావులు మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారులకు స్వచ్ఛంద సంస్థలు పరికరాలను అందించి ఆదుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు అమ్మినాయుడు, రేగిడి ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, శాంతికుమారి, వైద్యులు రాజశేఖర్, నేతాజీ, ఐఈఆర్‌టీలు ఎస్.హరిబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఫారం-డిపై నిర్లక్ష్యం వద్దు

రాజాం: ఫారం డి విషయంలో బీఎల్ఓలు నిర్లక్ష్యం చేయవద్దని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 80 ఏళ్లు దాటి వారితో ఫారం-డిని నింపించి.. ఈనెల 18 నుంచి 22వతేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దారు ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సాయం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన హోంగార్డు కెంగువ మహేశ్ కుటుంబానికి స్థానిక పోలీసు సిబ్బంది ఆపన్నహస్తం అందించారు. సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రూ.46 వేల ఆర్థిక సాయం అందించారు. ఎస్ఐ సత్యనారాయణ తదితరులు మహేశ్ ఇంటికి వెళ్లి ఆయన భార్యకు శుక్రవారం ఈ మొత్తాన్ని అందజేశారు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు.



హోంగార్డు కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ

అధికారుల పనితీరుపై టీడీపీ ధ్వజం

● వాడీవేడిగా బాడంగి మండల సమావేశం



అధికారులను నిలదీస్తున్న గజరాయనివలస ఎంపీటీసీ సభ్యుడు గౌరి

బాడంగి: వివిధ శాఖల అధికారుల పనితీరుపై టీడీపీ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు తీవ్రంగా ఆక్షేపించారు. శుక్రవారం ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవి మాట్లాడుతూ 2018లో అంగన్‌వాడీ బిల్డింగ్ కట్టామని, ఇప్పటికీ బిల్లులు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీంతో ఆ శాఖకు సంబంధించిన అధికారి బిక్కమొహం వేశారు. ఇల్లు కట్టమన్నారు... తీరా కట్టాక వైసీపీ ప్రభుత్వంలో ప్రతి సర్వసభ్య సమావేశంలో అడుగుతున్నప్పటికీ పాలవలస సింహాచలానికి బిల్లు ఇవ్వలేదని గజరాయనివలస టీడీపీ ఎంపీటీసీ సభ్యులు పాలవలస గౌరి అధికారులను నిలదీశారు. జమదాల ఆదమ్మకు కూడా ఇప్పటికీ బిల్లు చెల్లించలేదని టీడీపీ వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు అధికారులను నిలదీశారు. గడిచిన మూడేళ్లలో సచివాలయ భవనాలు కట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదని... వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. కరెంటు బిల్లులు చెల్లించకపోతే పంచాయతీలలో వీధిలైట్లతో పాటు రక్షిత మంచినీటి పథకాలు ఆగిపోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాడంగి సర్పంచ్ కండి రమేష్ మండిపడ్డారు. సగం సమాచారంతో అధికారులు వచ్చి సభ్యులకు తెలియజేయకపోవడం ఎంపీటీసీలను అగౌరవపరచడమేనని వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు అధికారుల తీరును ఎండగట్టారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయులు, జెడ్పీటీసీ రామారావు, ఏఎస్ఐ కొండలరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

● రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు



పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

రాజాం: పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఈనెల 15న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రోడ్‌షో నిర్వహిస్తారని.. ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కోరారు. శుక్రవారం సంతకవిటి మండలం మామిడిపల్లి గ్రామంలో కొళ్ల అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ప్రజలు హాజరయ్యేందుకు ప్రయత్నించాలని కోండ్రు కోరారు. అనంతరం వాసుదేవపట్నానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బొత్స వాసుదేవరావునాయుడు, గట్టి భాను, మొయ్యి నారాయణప్పడు, బొడ్డేపల్లి సూర్యనారాయణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● **వంగర:** టీడీపీ అధినేత చంద్రబాబు రాజాంలో ఈనెల 15న రోడ్ షో నిర్వహించనున్నారని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం వంగరలో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మద్దివలసలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తేనే మార్పు: కోళ్ల



ప్రచారం చేస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట: సీఎంగా చంద్రబాబు అధికారంలోకి వస్తేనే యువత జీవితాల్లో మార్పు వస్తుంద టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం శృంగవరపుకోట బర్మాకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, నాయకులు జీఎస్‌నాయుడు, రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, నానిగిరి రమణాజీ, కాపుగంటి శ్రీనివాసరావు, పొట్నూరు సాయిరాం, చెక్క కిరణ్ కుమార్, పెదగాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

బేబీనాయన ఇంటింటి ప్రచారం



పార్టీలో చేరిన వారితో బేబీనాయన

బొబ్బిలి: టీడీపీ, జనసేన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) శుక్రవారం పాతబొబ్బిలి 1, 2 వార్డులలో ఇంటింటి ప్రచారం చేశారు. ప్రసాద్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మహిళలు ఆయనకు చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని... అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. ఆయన వెంట రెండు వార్డుల ఇన్‌చార్జిలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

గొంగాడవలస, అన్నం నాయుడువలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జి.శ్రీనివాసరావు, కొట్నాన శ్రీను, గుల్ల లక్ష్మణ ఆధ్వర్యంలో వంద కుటుంబాలు శుక్రవారం బొబ్బిలి కోటలో బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరాయి. కలవరాయి, వాకాడ వలస గ్రామాలకు చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ పాటూరి కృష్ణమూర్తి, వాకాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 60 కుటుంబాలవారు వైసీపీని వీడి బేబీనాయన సమక్షంలో టీడీపీలో చేరారు. మెట్టవలసలో శుక్రవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో టీడీపీ చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ నేత అల్లాడ భాస్కరరావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగమాధవి

నెల్లిమర్ల: ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని కూటమి అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని దన్నానపేట, సీతారామునిపేట, గొర్లెపేట, ఎటి అగ్రహారం, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ, జనసేన నాయకులతో ఆయా గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలను కలిశారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. రానున్న ఎన్నికల్లో గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదితి గజపతిరాజు ప్రచారం

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తనను, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుని గెలిపించాలని కోరుతూ అదితి గజపతిరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 11వ డివిజన్ పరిధిలో ఇంటింటికి వెళ్లి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. అంబటి సత్తర్వు, ఘోషాసుపత్రి ఏరియా మీదుగా కాటవీధి జంక్షన్ వరకూ ఆమె పర్యటించారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని, సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. నగరంలోని నాలుగో డివిజన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ శుక్రవారం కొత్తపేట, నీళ్లట్యాంకు ఒడ్డున నివసిస్తున్న ఓటర్ల వద్దకు వెళ్లారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, ఆదితి గజపతిరాజును గెలిపించా లని కోరారు. నగరంలోని ఒకటో డివిజన్ వేణుగోపాలపురంలో శుక్రవారం రాత్రి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు మురగడాపు పార్వతి, నక్కిళ్ల శ్రీనివాసరావు, బొద్దాన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్: శ్రీనివాస్



టీడీపీలో చేరిన వారితో అభ్యర్థి శ్రీనివాస్

జామి: రాష్ట్రంలో బీసీల ద్రోహిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని గజపతినగరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కేఏ శ్రీనువాస్ అన్నారు. శుక్రవారం కుమారాంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్వామినాయుడు, కొత్తలి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

శృంగవరపుకోట రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీభరత్, కోళ్ల లలితకుమారిలను గెలిపించాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డొకుల అచ్చెంనాయుడు కోరారు. వైఎస్ ఎంపీపీ సుధారాజు, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సీతారాంపురం, గోపాలపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.

సత్తా చాటారు

● ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గజపతినగరం: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం విడుదల అయిన ఫలితాల్లో మరుపల్లి కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో రమాదేవి 470మార్కులకు 426 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దివ్య 1000కి 935 మార్కులు సాధించినట్టు ప్రత్యేక అధికారిణి షైమ తెలిపారు. అలాగే ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ బైపీసీలో డి.మైత్రీ 1000కి 886 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు చెప్పారు.

చీపురుపల్లి కళాశాలలో ఉత్తమ ఫలితాలు



గురాన అను (903)

చీపురుపల్లి: ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు శుక్రవారం తెలిపారు. ఎంపీసీ గ్రూపులో గురాన అను వెయ్యి మార్కులకు 903 మార్కులు సాధించినట్టు చెప్పారు. కంప్యూటర్ సైన్సులో తీడ కనకమహాలక్ష్మి 909 మార్కులు, పొదిలాపు మౌనిక 907 మార్కులు, ఎంఎల్‌టీ గ్రూపులో అల్లు రమ్య 960, పోరాపు జోసెఫ్ 939, అదపాక సంతోషి 936 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

నెల్లిమర్ల కళాశాలలో 57.4శాతం



బర్ల లలిత (435)

నెల్లిమర్ల: ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాల్లో నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 57.4 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 209 మంది పరీక్షలకు హాజరు కాగా 120 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎ.సోమేంద్రకు వెయ్యి మార్కులకు 910, జి.వెంకటరమణ 880 మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ● ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బర్ల లలిత 440 మార్కులకుగాను 435 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్ ఒకేషనల్ గ్రూపులో జి.పుష్పాంజలి వెయ్యి మార్కులకుగాను 971, ఎం.జ్యోతి 958 మార్కులు సాధించారని తెలిపారు.

గురుకులంలో 94 శాతం

నెల్లిమర్లలోని ఎంజేపీ ఏపీ బీసీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు 80 మంది పరీక్షలకు హాజరై 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ కళాశాలకు చెందిన ఎం.వర్షిత వెయ్యి మార్కులకు గాను 979 మార్కులు, ఎస్.వాణి 976 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని తెలిపారు.

దేవుపల్లి కేజీబీవీలో 50శాతం

బొండపల్లి: దేవుపల్లి కేజీబీవీలో 50శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రత్యేకాధికారిణి చంద్రకళ తెలిపారు. ప్రథమ ఏడాదిలో 19మంది విద్యార్థులకు 7 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బైపీసీలో ఓ.కృష్ణవేణి 915 మార్కులు సాధించినట్టు తెలిపారు. ద్వితీయ ఏడాదిలో 18 మందికి 8 మంది ఉత్తీర్ణత సాధించగా, అందులో ఎంపీసీ విభాగంలో డి.దీపికకు 874 మార్కులు వచ్చినట్టు తెలిపారు.

షికారుగంజిలో

దత్తిరాజేరు: ఇంటర్ ఫలితాల్లో షికారుగంజి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొదటి సంవత్సరం విద్యార్థి దుర్గాప్రసాద్ బైపీసీలో 417, ఎంపీసీలో ఆర్.లలిత 415, పి.జ్యోత్స్న 400 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో వి.లత 971, జె.సతీష్ 963 మార్కులు, వి.భవాని 940 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరానికి 38 మంది పరీక్షలు రాయగా 30మంది పాసైనట్టు, ద్వితీయ సంవత్సరంలో 59మంది పరీక్షలు రాయగా 54మంది పాసైనట్టు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. కేజీబీవీలో మొదటి సంవత్సరంలో 33 మందికి 25 మంది, ద్వితీయ సంవత్సరంలో 33 మందికి 33 మంది పాసై శతశాతం నమోదు చేసినట్టు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఎం.భవాని 925 మార్కులు, బి.మణి 904 మార్కులు, ఎస్.భాగ్యలక్ష్మి 895మార్కులు సాధించినట్టు తెలిపారు. జీజే కాలేజీలో ఫస్టియర్‌లో ఇద్దరు రాయగా ఇద్దరూ ఫెయిల్ అయినట్టు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. సెకండ్ ఇయర్‌లో 4మంది రాయగా ఇద్దరు పాసైనట్టు తెలిపారు.

భోగాపురంలో..

భోగాపురం: భోగాపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి ఏడాది 71 మందికిగాను 60 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఎంపీసీకి చెందిన ఎం.దేవేంద్రకు 470కిగాను 451, బైపీసీకి చెందిన పి.దేవికి 421 మార్కులు సాధించారు. ద్వితీయ ఏడాదికి 76 మందికిగాను 61 మంది ఉత్తీర్ణత సాధించగా బైపీసీలో బి.రేణుక 968 మార్కులు సాధించింది. కేజీబీవీలో మొదటి ఏడాదికి 31 మంది విద్యార్థులకుగాను 18మంది ఉత్తీర్ణత చెందగా బైపీసీలో ఎం.మాధవి 365 మార్కులు సాధించింది. ద్వితీయ ఏడాదికి 35మందికిగాను 26 మంది ఉత్తీర్ణత సాధించగా, బైపీసీలో ఆవు పావని 913 మార్కులు సాధించింది.

విద్వాన్‌లో ఉత్తమ ఫలితాలు

బొబ్బిలి: బొబ్బిలి విద్వాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు కరస్పాండెంట్ మరిపి వేణుగోపాలనాయుడు తెలిపారు. జి.సాయిలక్ష్మి 986, జి.రమాదేవి 980, చరణ్‌సాయి 979, బి.మోహిత 975, బి.సాయిహర్షిత 975 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ప్రథమ సంవత్సరంలో జి.మోహనరావు 464, బి.దేలారాణి 463, సీహెచ్ సుష్మిత 463 మార్కులు సాధించినట్లు వేణుగోపాలనాయుడు వివరించారు.

వాసు కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రామ్మూర్తి, వాసుదేవరావు

బొబ్బిలి: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక వాసు జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సీహెచ్ పావని ఎంపీసీలో 989 మార్కులు సాధించింది. వి.వరుణ్‌కుమార్ 986, ఆర్.భార్గవి 985, ఎం.సరిత 985, వి.వినయ్‌కుమార్ 985 చొప్పున మార్కులు సాధించారు. సెకెండ్ ఇయర్ బైపీసీలో ఆర్.జ్యోతి 970, వి.దీపిక 968 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు ప్రకటించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.ఇందు 453 మార్కులు సాధించింది. సీహెచ్ స్వప్న 462, కె.శివరామరాజు 462, వై.హరిణి 460, ఎ.గోవిందరావు 460 చొప్పున మార్కులు సాధించారు. బైపీసీలో ఎం.తనూష 425, ఆర్.రాణి 411 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల వ్యవస్థాపకులు, రాష్ట్ర టీడీపీ బీసీ విభాగం నేత రౌతు రామ్మూర్తి, ప్రిన్సిపాల్ మెండి వెంకటేష్, తదితరులు అభినందించారు.

'ఆదర్శ' విద్యార్థులు అదుర్స్

పెదమేడపల్లిలో..



బి.నేహ (ఎంపీసీ) 958



ఆర్.చాందిని (బైపీసీ) 890

మెంటాడ: పెదమేడపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఎంపీసీలో 76 శాతం, బైపీసీలో 100 శాతం ఫలితాలు సాధించా రు. ఎంపీసీలో 17 మందికి 13 మంది, బైపీసీలో 12కు 12 మంది ఉత్తీర్ణత చెందారు. ఎంపీసీలో బి.నేహ 958 మార్కులు సాధించగా, బైపీసీలో 890 మార్కులతో ఆర్.చాందిని ప్రథమ స్థానంలో నిలిచింది. మంచి ఫలితాల్లో సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ ఎం.జగన్మోహనరావు అభినందించారు.

అక్కివరంలో..



బి.అవినాష్ (ఎంపీసీ) 981



అనూష (బైపీసీ) 908

డెంకాడ: ఇంటర్ ఫలితాల్లో అక్కివరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. వీరిలో ద్వితీయ ఇంటర్‌లో బవిరిశెట్టి అవినాష్ (981-ఎంపీసీ), సీహెచ్ అనూష (908-బైపీసీ), ప్రథమ ఏడాదిలో టెక్కలి సురేష్(ఎంపీసీ) 440 మార్కులు, బొట్ట దేవి (బైపీసీ) 411 మార్కులు సాధించా రు. మొదటి సంవత్సరం 83శాతం, ద్వితీయ సంవత్సరం 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సీహెచ్ సత్య అభినందించారు

సతివాడలో 85శాతం

నెల్లిమర్ల: సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎ.ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 81 మంది హాజరు కాగా 85 శాతం, ప్రథమ సంవత్సరం పరీక్షలకు 87 మంది హాజరు కాగా 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. కె.ధనూష (ఎంపీసీ) వెయ్యి మార్కులకుగాను 955, పి.సుశీల (బైపీసీ) 967, వై.హైమా (సీఈసీ) 873 మార్కులు సాధించినట్టు చెప్పారు. ప్రథమ సంవత్సరంలో డి.ఆరుద్ర 450/470, పి.ఆశిష్ 411/440, ఎస్.సౌమ్య 389/500, ఎల్.అమూల్య 379/500 సాధించినట్టు తెలిపారు.

రాజాం కళాశాలలో తగ్గిన ఉత్తీర్ణత

రాజాం: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈ ఫలితాలు బాగా నిరాశపరిచాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 166 మందికి 50 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 30 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 206 మందికి 111 మంది ఉత్తీర్ణులయ్యారు. 54 శాతం ఫలితాలు నమోదయ్యాయి.

వంగరలోనూ అంతే...

వంగర: వంగర మండలంలోనూ ఇంటర్ ఫలితాలు నిరాశపరిచాయి. మడ్డువలస జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 113 మంది పరీక్షకు హాజరుకాగా... 27 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 116 మందికి గాను 42 మంది ఉత్తీర్ణులయ్యారు. మడ్డువలస గురుకులంలో ప్రథమ సంవత్సరంలో 60 మందికి గాను 38 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 62 మంది పరీక్షకు హాజరుకాగా 39 మంది ఉత్తీర్ణత సాధించారు.

రైల్వేగేటులో సాంకేతిక లోపం.. నిలిచిన ట్రాఫిక్



రైల్వేగేటు సాంకేతిక లోపంతో నిలిచిన ట్రాఫిక్

గజపతినగరం: స్థానిక మెంటాడ రోడ్డు రైల్వే గేటులో శుక్రవారం సాంకేతిక లోపం ఏర్పడిన కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రైల్వేశాఖ అధికారులు చేరుకుని సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో యధావిధిగా రాకపోకలు సాగాయి. సుమారు అరగంట పాటు వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే మెంటాడ రైల్వే గేటుకు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు. అయినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రతిరోజూ గేటు సమస్య తలెత్తుతుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మెంటాడ: ఉపాధి వేతనదారులకు చెల్లించవలసిన రెండు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. పనుకువానివలసలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కక్కరికి రెండు వందల రోజులు పనిదినాలు కల్పించాలని కోరారు. వేతనదారులకు పనిముట్లు అందజేయాలని, పని ప్రాంతం వద్ద టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నెల్లిమర్ల: కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు రెవెన్యూ అధికారులు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్క ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఎస్ మూర్తి, హెచ్‌డీటీ డి.శైలజ సూచించారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల: సీతారామునిపేట ప్రాంత విద్యుత్ ఫీడర్‌లైన్ల నిర్వహణ పనుల కారణంగా ఈనెల 14న మండలంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సీతారామునిపేట, గొర్లెపేట, కొత్తపే, దీపిల్లిపేట, టొంపలపేట, జగ్గరాజుపేట, దన్నానపేట, కోరాడపేట, కుదిపి, నీలంరాజుపేట, బృందావన్‌వ్యాలీ, ఎటి అగ్రహారం, వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలోని పంప్ హౌస్, సత్య థియేటర్, జేహెచ్‌సీ కాలనీ, ఎంఆర్వో కార్యాలయ ప్రాంతం, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్, మిమ్స్ ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 10 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● **మెంటాడ:** ఇద్దనవలస సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని మెంటాడ ఏఈ తిరుపతి తెలిపారు. వినియోగదారులు గమనించగలరని కోరారు.

మత్స్యకారుల ప్రచారం

రాజాం: రాజాం మండలంలో మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు బెహరా తవుడు ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. గడ్డిముడిదాం, వంగర మండలం అరసాడ, రేగిడి మండలం ఒప్పంగి గ్రామాల్లో 200 మంది మత్స్యకారులతో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు అగ్రహారంపు హరి, పాండ్రింకి ఆదినారాయణ, పాండ్రంకి భజంగరావు, కొనపల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే బేబీనాయన గెలుపునకు సోపానం

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో ఈ ప్రాంతంలో బొబ్బిలి రాజులు చేసిన అభివృద్ధే వారి విజయానికి సోపానమని విజయనగరం పార్లమెంటరీ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు అన్నారు. బేబీనాయనకు మద్దతుగా శుక్రవారం ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తమ సొంత నిధులతో ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్నో ఏళ్ల నుంచి సేవలందిస్తున్నారన్నారు. ఇటువంటి అభ్యర్థికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. అయన వెంట బూసాయవలస సర్పంచ్ ప్రతినిధి గంట సాయికుమార్ ఉన్నారు.

20న మండల సమావేశం

శృంగవరపుకోట: ఈనెల 20న శృంగవరపుకోట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: కళా



ప్రసంగిసున్న కళావెంకటరావు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని నిమ్మలవలస, గుణిదాం గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. తనను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, కెల్ల రామారావు, గొర్లె లక్ష్మణరావు, వలిరెడ్డి శ్రీరాములునాయుడు, జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, బీజేపీ యువమోర్చా నాయకుడు మన్నెపురి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

గుర్ల: పేదల కష్టాలు, కన్నీళ్లు తెలుసునని, వారికి అండగా ఉంటానని చీపురుపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కమిడి కళావెంకటరావు అన్నారు. పెంబర్తి జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు రామ్‌మల్లిక్‌నాయుడు, వి.సన్యాసినాయుడు, సీహెచ్.మహేశ్వరరావు, కిరణ్‌కుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, కోట్ల మోతిలాల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం ప్యాడ్ బ్యాంకులు

గరివిడి: గరివిడి మండలం ఐతంవలస, చిన్న ఐతంవలస గ్రామాల్లో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో సోషల్ వలంటీర్ ప్రాజెక్టు ద్వారా సేవ్ మహిళ పేరుతో ప్రాజెక్టు మేనేజర్ రెడ్డి రమణ ప్యాడ్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయురాలు రమాదేవి, ఆశయ సంస్థ సభ్యుడు మణికంఠ, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగులను భాగస్వామ్యం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

గరివిడి: సమాజంలో జరిగే కార్యక్రమాల్లో దివ్యాంగులను భాగస్వామ్యం చేయాలని ఎంఈవోలు పి.రామారావు, డి.అప్పన్న అన్నారు. సమగ్ర శిక్షా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భవిత కేంద్రం వద్ద 3 నుండి 18 ఏళ్ల వయస్సుగల దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి గుర్ల మండలాలకు చెందిన సుమారు 100 మంది దివ్యాంగులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎం.భారతి, వైద్యులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

గరుగుబిల్లి: కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా కృషి చేయాలని టీడీపీ ప్రతినిధులు మర్రాపు పురుషోత్తంనాయుడు, పొట్నూరు వెంకటనాయుడులు సూచించారు. శుక్రవారం చిలకాంలో అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ సమన్వయంతో ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతలు విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ ప్రతినిధులు మరడాన తవిటినాయుడు, కోట భరత్‌కుమార్, అంబటి రాంబాబు, పి.పూర్ణచంద్రరావు, కండే బలరాంనాయుడు, జి.నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సీతానగరం: కృష్ణరాయపురం గ్రామంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచం ద్ర శుక్రవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంట సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటా న్ని బుజం మీద పెట్టుకుని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పూడి శ్రీరాం, తాతబాబు, పరశినాయుడు శ్రీను సమక్షంలో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో గొట్టాపు వెంకటినాయుడు, బార్నల సీతారాం, అక్కెన ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రవిశేఖర్‌ను కలిసిన కలిశెట్టి



కలిశెట్టికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవిశేఖర్

నెల్లిమర్ల: విజయనగరం పార్లమెంటు కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షిలను మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం నెల్లిమర్లలోని వారి ఇంటికి వెళ్లి, తన కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో పాటు తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

జామి: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన రామభద్రపురం, జట్టేడివలస, గొడుకొమ్ము, అలమండ గ్రామాల్లో పోలీసు బలగాలు కవాతు చేశాయి. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గోవిందరావు, సీఐ ఉపేంద్ర, ఎస్ఐ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

మక్కువ: మునక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 21న నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత కోరారు. సంబంధిత విషయాన్ని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.